సోలార్ వైపు జనం మొగ్గు

- మూడు జిల్లాల పరిధిలో ద్వితీయ స్థానంలో గుడివాడ డివిజన్
- డివిజన్‌లో 43వేలకు పైగా దరఖాస్తులు
- ఎస్సీ, ఎస్టీలకు 36 వేల సోలార్ కనెక్షన్ల మంజూరు


గుడ్లవల్లేరులో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్‌ను చూపుతున్న వినియోగదారుడు శేషకుమార్

గుడ్లవల్లేరు: సోలార్ వినియోగంపై ప్రజల్లో నానాటికీ అవగాహన పెరుగుతోంది. పీఎం సూర్యఘర్ పథకానికి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో సోలార్ వినియోగానికి వచ్చిన దరఖాస్తుల్లో గుడివాడ డివిజన్ ద్వితీయ స్థానంలో ఉంది. గుడివాడ డివిజన్ పరిధిలో సోలార్ విద్యుత్‌కు 43 వేల మందికి పైగా వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 150 సోలార్ ప్యానెల్స్ అమర్చారు. ఎస్సీ, ఎస్టీలకు 36,740 సోలార్ కనెక్షన్లు మంజూరయ్యాయి. వారికి త్వరలో సోలార్ యూనిట్లు అమర్చనున్నారు. జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.సత్యానందం ఆదేశాల మేరకు గ్రామాల్లో సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సులను చేపడుతున్నారు. రాబోయే రోజుల్లో పల్లెల్లో అంతా కేవలం సోలార్ విద్యుత్ వెలుగులనే చూసినా...ఆశ్చర్యం ఏమీ లేదు. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాట్లకు బ్యాంకు రుణాలతో పాటు సబ్సిడీలను కూడా ఇవ్వటంతో వినియోగదారులకు ఈ సోలార్ విద్యుత్ వినియోగం సులభతరంగా అందుబాటులోకి వస్తోంది. గతంలో విద్యుత్ బిల్లుకు చెల్లించే సొమ్ము బ్యాంకుకు ఈఎంఐగా చెల్లిస్తే సబ్సిడీ కూడా వస్తుందన్న భావనలో వినియోగదారులు ఉన్నారు. అంతేగాక వినియోగదారులు ఇంటికి వాడుకునే విద్యుత్‌ను సోలార్ ద్వారా తామే సొంతంగా తయారు చేసుకోవటమే గాక తాము వినియోగించిన విద్యుత్‌లో మిగులు కరెంట్‌ను ఆ విద్యుత్ శాఖ వారికే తిరిగి విక్రయించడం ద్వారా ప్రతి నెల అదనపు ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉండటంతో ప్రజలు సోలార్ వైపు మొగ్గు చూపుతున్నారు.

సోలార్ గ్రామంగా సింగలూరు



మండలంలోని సింగలూరు గ్రామాన్ని సోలార్ విద్యుత్ వినియోగ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్క ఇంటికి సోలార్ ప్యానెల్స్‌తో యూనిట్లను బిగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందుకు మా బ్యాంకు నుంచి ఆ గ్రామస్తులకు పీఎం సూర్య ఘర్ పథకం కింద రుణాలను మంజూరు చేస్తున్నాం.

– ఎం.మనోజ్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజర్, గుడ్లవల్లేరు

వినియోగదారులే తయారీదారులు



విద్యుత్ వినియోగదారులే తయారీదారులుగా మారుతున్నారు. అందుకు మా సింగలూరు గ్రామమే నిదర్శనం. పీఎం సూర్యఘర్‌తో సోలార్ ప్యానెల్స్ యూనిట్‌కు అయ్యే రుణాన్ని స్టేట్‌బ్యాంకు వారు ఇస్తున్నారు. ఆ యూనిట్‌కు సబ్సిడీ సొమ్మును కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల ఖాతాల్లో జమ చేయనుంది.

– డాక్టర్ బందారు శ్యామ్‌కుమార్, ప్రముఖ సంఘ సేవకుడు, సింగలూరు

సోలార్‌పై వినియోగదారుల మక్కువ



మూడు జిల్లాల్లో సోలార్ వినియోగానికి దరఖాస్తుల్లో గుడివాడ డివిజన్ ద్వితీయ స్థానంలో ఉంది. డివిజన్ పరిధిలో 43 వేలకు పైగా దరఖాస్తులు సోలార్ విద్యుత్‌కు వచ్చాయి. ఇప్పటివరకు 150 సోలార్ ప్యానెల్స్ అమర్చాం. ఎస్సీ, ఎస్టీలకు 36,740 సోలార్ కనెక్షన్లు మంజూరయ్యాయి. ఆయా వర్గాలకు పూర్తి రాయితీతో త్వరలో యూనిట్లను అమరుస్తాం.

– జి.బి.శ్రీనివాసరావు, ఏపీసీపీడీసీఎల్ ఈఈ, గుడివాడ

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

తహసీల్దార్ కుసుమకుమారి


ఐలూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు: మహా శివరాత్రి ఉత్సవాల విజయవంతానికి అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి సూచించారు. ఐలూరులోని శ్రీగంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 26న జరగనున్న శివరాత్రి ఏర్పాట్లపై గురువారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ, రెవెన్యూ, దేవదాయ, ట్రాన్స్‌కో, ఎక్సైజ్, ఆర్టీసీ, పోలీస్, ఫిషరీస్, ఇరిగేషన్, ఆర్సీ, వైద్యారోగ్య శాఖ అధికారులతో కుసుమకుమారి సమీక్ష జరిపారు. శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐలూరు క్షేత్రానికి ఉన్న విశిష్టత దృష్ట్యా భక్తులు అధికసంఖ్యలో వస్తారని, భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పుష్కరఘాట్‌ను పునరుద్ధరించాలి

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఐలూరు కృష్ణానదీ తీరాన ఉన్న పుష్కరఘాట్‌ను పూడ్చేసి, రహదారిగా మార్చటంపై జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్న ఇలాంటి చర్యలు సరికాదన్నారు. అధికారులు పుష్కరఘాట్‌పై ఏర్పాటు చేసిన రహదారిని వెంటనే తొలగించాలని సూచించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పంచాయతీలో నిధులు లేవు

ఐలూరు గ్రామ పంచాయతీ చాలా చిన్నదని, ఉత్సవాల పేరుతో లక్షలు వాడటానికి తమ వద్ద నిధులు లేవని సర్పంచ్ పిరాటి సుజాత అన్నారు. దేవాలయానికి పొలాల ద్వారా వచ్చే ఆదాయం, హుండీల ఆదాయంపై ఎందుకు అధికారులు లెక్కలు చెప్పటం లేదని నిలదీశారు. పంచాయతీ ద్వారా సున్నం, బ్లీచింగ్, తాగునీరు తప్ప ఒక్క రూపాయి కూడా అదనంగా ఖర్చు చేసేది లేదని తెగేసి చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ రవికాంత్, పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్ఐ అవినాష్, ఆలయ ఈఓ శివగోపాల్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వీఆర్ఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సులువైన మార్గాలలో సమస్యల పరిష్కారం


వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

గుడివాడటౌన్: విద్యుత్‌శాఖలో సమస్యలను అదాలత్ ద్వారా సులువుగా పరిష్కరించుకోవచ్చని విద్యుత్ అదాలత్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని డీవీఎస్ ఫంక్షన్ హాలులో గురువారం విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల మీటర్లు, అధిక బిల్లులు, విద్యుత్ సరఫరా(లోడు), విద్యుత్ లైన్ల సమస్యలు వంటివి ఇక్కడ చర్చించి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారి సమస్యలు పరిష్కరించడానికి అదాలత్ కార్యాలయం విజయవాడలోని గుణదలలో ఉందన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం కార్యక్రమాలను సమీప డివిజన్ స్థాయి కార్యాలయాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వినియోగదారులు తమ సమస్యలను నేరుగా కాని కొరియర్, మెయిల్ ద్వారా గాని తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ విభాగం నిపుణుడు వెంకటకృష్ణ, ఫైనాన్స్ విభాగం అధికారి ఆర్‌సీహెచ్ శ్రీనివాస్, అదాలత్ సభ్యురాలు సునీత, గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు, గుడివాడ, కైకలూరు సబ్ డివిజన్‌ల ఏడీఈలు, ఏఈలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొవ్వలో తడి చెత్త-పొడి చెత్తపై అవగాహన


మొవ్వ ఎస్టీ కాలనీలో అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మొవ్వ: ప్రతి ఇంటిలోని చెత్తను ప్లాస్టిక్, తడి, పొడి చెత్తలుగా విడగొట్టి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని, ఇంటిలోని చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు సూచించారు. స్వచ్ఛ పంచాయతీ ఉద్యమంలో భాగంగా గురువారం వేకువ జాము నుంచి మొవ్వ గ్రామ పంచాయతీ పరిధిలోని జేజే నగర్, ఎస్టీ కాలనీలలో ఆయన గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, అధికారులతో కలిసి పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతిరోజు స్వచ్ఛ ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎంఎస్‌కే పరమాత్మ, పంచాయతీ (గ్రేడ్- 1) కార్యదర్శి కేవీ సోమేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ కళ్యాణి, మొవ్వ-1 సచివాలయం గ్రేడ్ 5 కార్యదర్శి అవనిగడ్డ నాగమహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగలూరులో కలెక్టర్ బాలాజీ ఆకస్మిక పర్యటన


అంగలూరులో కాలినడకన పర్యటిస్తున్న కలెక్టర్ బాలాజీ

గుడ్లవల్లేరు: అంగలూరులో జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ ఆకస్మికంగా మార్గ మధ్యంలో గురువారం సాయంత్రం కారు దిగి, ప్రధాన రహదారి వెంబడి నడుస్తూ గ్రామాన్ని పరిశీలించారు. ఇంటింటికీ కాలి నడకన వెళ్లి మహిళలతో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్తను గ్రామ పంచాయతీ వారు విడి విడిగా సేకరిస్తున్నారా? లేదా అని విచారించారు. విడి విడిగానే చేస్తున్నారని మహిళలు సమాధానం ఇచ్చారు. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ టి.విజయ సారథి, తహసీల్దార్ బి.లోకరాజు, కార్యదర్శి ఎలీషారావు, వీఆర్వో లక్ష్మయ్య, సిబ్బంది ఉన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేద్దాం

గుడివాడటౌన్: గుడివాడ పట్టణం, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అందరం కలిసి పని చేద్దాం అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. తన నివాసంలో గురువారం ఆయన గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ మండలాలకు సంబంధించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం నూతన కంపెనీల ఏర్పాటుకు కేవలం భూమి, సబ్సిడీ ఇస్తే ఎవరూ ఆకర్షితులవడంలేదన్నారు. వాటితో పాటు జీవన శైలికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఏదైనా ఓ పరిశ్రమ రావాలంటే పట్టణ ఎదుగుదల, మౌలిక వసతులు కూడా పరిగణనలోకి తీసుకుంటున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధి ఎంతో అవసరం అన్నారు. ప్రస్తుతం తాను వార్డుల్లో పర్యటిస్తున్న సమయంలో సమస్యలు గుర్తించ గలుగుతున్నానన్నారు. ప్రధాన రహదారి అభివృద్ధి చేస్తే కొంతైనా పారిశ్రామికవేత్తలను ఆకట్టుకోవచ్చన్నారు. మీడియా మిత్రులు పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

సమాన హక్కులు పొందడమే సామాజిక న్యాయం


కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సామాజిక న్యాయంపై ప్రసంగిస్తున్న జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి

కైకలూరు: సమాజంలో ప్రతి ఒక్కరూ సమాన హక్కులు పొందడమే సామాజిక న్యాయమని కైకలూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి చెప్పారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తాలూకా లీగల్ సెల్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి లక్ష్మి మాట్లాడుతూ న్యాయం, సామాజిక న్యాయం మధ్య వ్యత్యాసాలను విద్యార్థులకు వివరించారు. వ్యక్తి హక్కులను పొందాలంటే సామాజిక న్యాయం పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత, న్యాయవాదులు పి.పవన్ కాంత్, డి.శివప్రసాద్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ వై.జ్ఞాన ప్రసూనాంబ, అధ్యాపకురాలు ఎల్.స్వప్న, మహిళా పోలీసులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించండి

పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

గుడ్లవల్లేరు: పీడీఎఫ్ ఎమ్మెల్సీగా కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాలని పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ విజ్ఞప్తిచేశారు. గుడ్లవల్లేరు శేషాద్రిరావు ఇంజినీరింగ్ కాలేజీలోని అధ్యాపకులను గురువారం ఆయన కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రపాల్, జన విజ్ఞాన కేంద్ర నాయకుడు బి.వి.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం తదితరులు పాల్గొన్నారు.

భట్లపెనుమర్రులో ఘనంగా ముస్లేహ్ మౌఊద్ దినోత్సవం

భట్లపెనుమర్రు(మొవ్వ): మొవ్వ మండలం భట్లపెనుమర్రులో గురువారం అంతర్జాతీయ అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో మసీదు ప్రాంగణంలో కమ్యూనిటీ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షతన ముస్లేహ్ మౌఊద్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక మసీదు గురువు ముహమ్మద్ యాకూబ్ పాషా మాట్లాడుతూ ముస్లేహ్ మౌఊద్ అహ్మదీయ కమ్యూనిటీ రెండవ ఉత్తరాధికారిగా 52 సంవత్సరాల పాటు సేవ చేసి, నిజమైన శాంతియుత ఇస్లాం మార్గాన్ని బలపరిచారని తెలిపారు. కార్యక్రమంలో షేక్ హైదర్ వలీ సాహెబ్, షేక్ నాసర్ సార్, షేక్ మీరావలి, షేక్ సిద్ధ సాహెబ్, షేక్ నాసర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వేత్త తారాపతిరావు మృతి



గుడ్లవల్లేరు: ప్రముఖ సామాజిక వేత్త బందారు తారాపతి రావు(69) నెల్లూరులో బుధవారం రాత్రి మృతి చెందారు. మండలంలోని సింగలూరును దత్తత తీసుకున్న ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బందారు శ్యామ్‌కుమార్‌కు తారాపతిరావు స్వయానా సోదరుడు. గతంలో ఆయన గుడివాడ పట్టణ యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశారు. తారాపతిరావు మృతికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, మాజీ మంత్రి కఠారి ఈశ్వరకుమార్, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ కార్యదర్శి కిలారు రంగప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శిష్ట్లా దత్తాత్రేయులు, కొంతి దామోదరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ గుండిమెడ రాఘవేంద్రరావు, సింగలూరు గ్రామస్తులు సంతాపం తెలియజేశారు.

గుడ్లవల్లేరు పాలిటెక్నిక్‌లో 34 మందికి కొలువులు


విజేతలతో ప్రిన్సిపాల్ రాజశేఖర్

గుడ్లవల్లేరు: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్‌లో 34 మంది విద్యార్థులు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ గురువారం విలేకరులకు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన బహుళ జాతి ఔషధ, బయో టెక్నాలజీ సంస్థ లార్స్ లాబ్స్ వారు గుడ్లవల్లేరు పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలను నిర్వహించారని చెప్పారు. 16మంది ఎలక్ట్రికల్, 18మంది మెకానికల్ విద్యార్థులు ఒక్కొక్కరు రూ.2.30 వార్షిక ఆదాయానికి ఎంపికయ్యారన్నారు. ఈ సంస్థలో ఉద్యోగాలు సాధించిన తమ విద్యార్థులకు ఏటా రిటెన్షన్ బోనస్ రూపంలో రూ.25వేలు చెల్లిస్తుందన్నారు. భోజన సదుపాయాలతో పాటు రవాణా ఖర్చులు కూడా లార్స్ సంస్థే భరిస్తుందన్నారు. ఏటా రూ.40వేల వరకు ఇంక్రిమెంట్ కూడా ఉంటుందన్నారు. విజేతలతో పాటు ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలకు కారకుడైన ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.వినయ్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, మెంటార్ ఎన్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

కొనసాగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ

కైకలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలకు పునాది అభ్యాసన బలోపేతం అంశంపై 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు నిమిత్తం ఈ నెల 18 నుంచి కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణ గురువారానికి మూడో రోజుకు చేరింది. మండలంలో 73 మంది టీచర్లకు మొదటి 6 రోజులు శిక్షణను రిసోర్సుపర్లను టి.జయరాజు, కె.సురేష్, సీహెచ్ బోసుబాబు అందిస్తున్నారు. ఎంఈవో-2 వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిక్షణ అంగన్‌వాడీ టీచర్లకు ఎంతగానో ఉపయోగడపతుందన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని కలిదిండి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బి.స్వర్ణకుమారి పర్యవేక్షించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సీహెచ్ ప్రసూన, జి.కరుణకుమారి పాల్గొన్నారు.

మండవల్లి హైస్కూల్‌లో...

మండవల్లి: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణలో భాగంగా ఎంఈఓ రత్నసునాదం, హెచ్ఎం ప్రసాద్, సీడీపీఓ దీప్తి ఆధ్వర్యంలో గురువారం మూడో రోజు మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శారీరక, భాష, మేధా అభివృద్ధి, సృజనాత్మకత, సామాజిక, భావోద్వేగ అభివృద్ధి కోసం కృత్యాలు, ప్రాముఖ్యత గురించి శిక్షణ ఇచ్చారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు ఎదుర్కోవాలి

ముదినేపల్లి రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటే విజయం సాధించొచ్చని ఏలూరు డీఈడీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ చోరగుడి ఇస్రాయేల్ అన్నారు. మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్, సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు ప్రేరణ కల్పించేందుకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇశ్రాయేలు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో అనేక సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. వీటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు యోగా, ధ్యానం వంటి శిక్షణలతో పాటు మానసిక ధైర్యాన్ని అలవరచుకోవాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

నందివాడ మండలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

నందివాడ: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి, ఏడు వాహనాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.70వేలు జరిమానా విధించినట్టు ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్ఐ హెచ్చరికలు జారీ చేశారు.

కుంభమేళాకు బస్సుయాత్ర

గుడివాడటౌన్: కుంభమేళా భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్ ఏర్పాటు చేసినందుకు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. గుడివాడ నుంచి కుంభమేళాకు ప్రత్యేక బస్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ డి.రాజేష్ మాట్లాడుతూ భక్తుల అవసరం పెరిగితే మరో బస్సు కూడా ఏర్పాటు చెయ్యడానికి ఆర్టీసీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

రైతుల విశిష్ట సంఖ్య నమోదు పరిశీలన

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం రైతుసేవా కేంద్రంలో జరుగుతున్న విశిష్ట నమోదు సంఖ్యను ఏడీఏ జి.వెంకటమణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తారన్నారు. పలు పథకాల లబ్ధి, వ్యవసాయ సంబంధిత రాయితీలు, పీఎం కిసాన్ సాయం, ప్రభుత్వం అందజేసే రాయితీలు, పథకాలు అందాలంటే ప్రతి రైతూ ఈ గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని తెలిపారు. సొంత భూమి కలిగిన రైతులు వారి పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఆధార్ నంబర్‌కు లింకు అయిన ఫోన్ తీసుకుని రైతుసేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఎస్‌కే జరీనా పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్ల పరిశీలన



గుడివాడటౌన్: గుంటూరు – కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యంతో కలిసి గురువారం ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రాడ్యుయేట్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. పోలింగ్ బూత్‌ల వద్ద భద్రత, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. స్త్రీలకు, దివ్యాంగులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ డీటీ బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్‌ను పునరుద్ధరిస్తాం

తోట్లవల్లూరు: ఐలూరులోని కృష్ణానది రేవు వద్ద పూడ్చేసిన పుష్కరఘాట్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని రివర్ కన్జర్వేటివ్ ఏఈఈ జనార్దన్ తెలియజేశారు. స్థానిక పుష్కరఘాట్‌ను గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూడ్చేసిన పుష్కరఘాట్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దండి

పమిడిముక్కల: చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎంఎన్ రాణి తెలిపారు. మండలంలోని అగినపర్రు గ్రామంలో ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావుతో కలిసి పర్యటించారు. చెత్త సేకరణను పరిశీలించారు. గ్రామస్తులను చెత్త సేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. చెత్త సేకరణ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నరసింహారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

మొవ్వ: మొవ్వ మండలంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనులపై జరుగుతున్న సోషల్ ఆడిట్‌లో భాగంగా గురువారం మొవ్వ మండలంలో ఐదు బృందాలు ఆడిట్ నిర్వహించాయి. మొవ్వలో డీఆర్‌పీ బి.లక్ష్మి బృందం 102 పనులకు సంబంధించి ఆ కూలీల నుంచి వివరాలు నమోదు చేసుకుని ఎస్ఆర్‌పీ సత్యనారాయణకు అందజేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మూలంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించాల్సిన బహిరంగ సభ ఈనెల 24న మచిలీపట్నం డ్రామా కార్యాలయంలో పరిశీలించినట్లు తెలిసింది.

ఒలింపియాడ్‌లో విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

గుడివాడటౌన్: రాష్ట్ర స్థాయి మ్యాథ్స్ అండ్ సైన్స్ ఒలింపియాడ్ పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయ భాస్కర్ గురువారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన స్కాలర్స్ ఇంటిగ్రల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ నిర్వహించిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు వి.చైతన్య ద్వితీయ, ఎం.రామ్‌కుమార్, జి.ఉమేష్‌చంద్ర, ఎస్.శ్రీనిధి తృతీయ ర్యాంక్‌లతో పాటు నగదు పురస్కారం పొందారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాలలో అభినందించారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ జట్టులో కైకలూరు విద్యార్థిని



కైకలూరు: జాతీయ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో ఏపీ రాష్ట్ర జట్టుకు కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ బీకాం ప్రథమ సంవత్సర విద్యార్థిని లావణ్య ఎంపికైందని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత గురువారం చెప్పారు. ఈ నెల 16 ,17 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ బాలికల నెట్‌బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానం గెలుచుకుందన్నారు. ఆ జట్టులో ఎంపికైన లావణ్య హర్యానాలోని భివానీలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగే 37వ జాతీయ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా లావణ్య, క్రీడలో తర్ఫీదు ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఎం.శివనాగరాజును ప్రిన్సిపాల్ అభినందించారు.